క్లుప్తంగా

పెండింగ్ బిల్డింగ్ ప్లాన్లను పరిష్కరించాలి

అమలాపురం టౌన్: పట్టణంలో పెండింగ్‌లో ఉన్న బిల్డింగ్ ప్లాన్లు, లే అవుట్ల అనుమతులకు సంబంధించిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో టౌన్ ప్లానింగ్ విభాగం ఓపెన్ ఫోరం సమావేశం శుక్రవారం జరిగింది. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, 15 వార్డు సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు, లైసెన్స్ టెక్నికల్ పర్సన్ల (ఎస్‌టీపీ)తో కమిషనర్ సమీక్షించారు. టౌన్ ప్లానింగ్ పరంగా ఉన్న పలు సమస్యలపై చర్చించారు. కొత్తగా బిల్డింగ్ ప్లాన్ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్న వారికి విధి విధానాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణంలో భవనం ప్లాన్ కోసం దరఖాస్తు వస్తే మున్సిపాలిటీ తక్షణమే జవాబుదారీతనంగా ఉండాలని చెప్పారు. ప్లాన్లపై స్వల్ప అభ్యంతరాలుంటే ఓపెన్ ఫోరంలో పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు..

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

ముమ్మిడివరం: ఎస్పీ బి.కృష్ణారావు శుక్రవారం ముమ్మిడివరం పోలీస్ స్టేషన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల పురోగతిని సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్సై డి.జ్వాలాసాగర్‌ను అడిగి తెలుసుకున్నారు. క్రైం రేట్‌పై సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్ గదుల్లో వర్షపు నీరు లీకేజీ కాకుండా కొత్తగా వేసిన రూఫ్‌ను ఎస్పీ పరిశీలించారు. స్టేషన్‌లో వసతులపై సీఐ, ఎస్సైతో పాటు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

ఘనంగా ఖాజా బాబా ఉరుస్ ప్రారంభం



గుర్రంపై గంధాన్ని ఊరేగిస్తున్న ముస్లింలు

అమలాపురం టౌన్: పట్టణంలోని హజరత్ సయ్యద్ ఖాజాబాబా 67వ ఉరుస్ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం నుంచి ఫకీరు మేళాలతో దర్గా నుంచి గంధం కార్యక్రమం వైభవంగా జరిగింది. గంధాన్ని గుర్రంపై ఉంచి, పురవీధుల్లో ఊరేగించారు. ఫాతెహా ఖాని, ఆమ్‌ఖాస్ దావత్ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కోనసీమ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్, సయ్యద్ హజరత్ ఖాజాబాబా వారి ఉరుసు యువజన కమిటీ సంయుక్తాధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు జరిగాయి. శని, ఆదివారాల్లో ఉరుసు ఉత్సవాలు కొనసాగుతాయని అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ బషీర్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో దర్గా ప్రాంగణం సందడిగా కనిపించింది.

సమస్యను పరిష్కరించాలి

యానాం: సుంకరపాలెం జంక్షన్‌లోని ప్రధాన కల్వర్టు ప్రాంతంలో డ్రెయినేజీ మూసుకుపోవడంతో మురుగునీరు రహదారిపై ప్రవహిస్తోందని, తక్షణం ఈ సమస్యను పరిష్కరించాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక బైపాస్ రహదారి వ్యాపారులు ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో, క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికా రులను నిర్దేశించారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి వినతి

ముమ్మిడివరం: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీఆర్‌టీయూ జిల్లా శాఖ నాయకులు శుక్రవారం ముమ్మిడివరంలో డీఈఓ డాక్టర్ సలీంబాషాకు వినతిపత్రం అందజేశారు. క్రిస్మస్ రోజుల్లో ఎఫ్ఎల్ఎన్ శిక్షణను వాయిదా వేయాలని, పదో తరగతికి ఉద్దేశించిన 100 రోజుల ప్రత్యేక శిక్షణను సెలవు దినాల్లో రాకుండా చూడాలని కోరారు. రామచంద్రపురంలో మిగులు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను మండల పరిషత్ పాఠశాలలోకి సర్దుబాటు చేయాలని కోరారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి సురేష్‌బాబు పాల్గొన్నారు.

గోరంత ఆదా.. కొండంత వెలుగు

- విద్యుత్ పొదుపుతో భవితకు కాంతులు
- వినియోగం, పొదుపుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు
- ముగిసిన జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు



అమలాపురంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు

అమలాపురం రూరల్: రోజురోజుకూ విద్యుత్ అవసరాలు పెరుగుతున్నాయి. కరెంటు లేకుండా పది నిమిషాలు ఉండలేమన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఇల్లయినా, ప్రభుత్వ కార్యాలయమైనా, పరిశ్రమైనా ప్రతి విషయం విద్యుత్‌తో ముడిపడి ఉంది. విద్యుత్ వినియోగం పెరగడంతో.. బిల్లులు అధికంగా రావడమే కాకుండా, పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీనిని కట్టడి చేసేందుకు విద్యుత్ వృథాను అరికట్టి, పొదుపుగా వాడాల్సిన అవసరముంది. ఈ నేపథ్యంలోనే విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలంటూ వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ఏపీఈపీడీసీఎల్ అవగాహన వారోత్సవాలను విస్తృతంగా నిర్వహించింది. అమలాపురం డివిజన్ పరిధిలోని అమలాపురం, ముమ్మిడివరం నియోజకర్గాల్లో ఉన్న అమలాపురం పట్టణం, రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

పొదుపుతోనే ప్రగతి

రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ పేరిట జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు జరిపారు. విద్యుత్ వృథా క్షమించరాని నేరం, విద్యుత్ పొదుపు-ప్రగతికి మలుపు, సహజ వనరులను కాపాడుకుందాం.. భావి తరాలకు భరోసా కల్పిద్దాం, విద్యుత్ పొదుపు-భవితకు మలుపు తదితర నినాదాలతో పలు గ్రామాల్లో వినియోగదారులకు అవగాహన కల్పించింది. విద్యుత్ ఇంధన పొదుపు, పేద, మధ్య తరగతి కుటుంబాలకు అత్యవసరం. సాధారణ బల్బుల స్థానే ఎల్ఈడీల వినియోగంతో సుమారు 60 శాతం విద్యుత్ ఆదా చేయవచ్చని అధికారులు ప్రచారం చేస్తున్నారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు.

డిజిటల్ మీటర్లతో..

కొత్తగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్ డిజిటల్ మీటర్లు అతి చిన్న ఎల్ఈడీ లైటును వినియోగించినా రీడింగ్ లెక్కిస్తాయి. గతంలోని మెకానికల్ మీటర్లు తొలగించి, వాటి స్థానే ఇవి ఏర్పాటు చేశారు. రిమోట్‌తో టీవీ ఆఫ్ చేసినా, చార్జర్లకున్న ఎల్ఈడీ లైట్ల విద్యుత్ వాడకాన్ని కూడా అవి పరిగణనలోకి తీసుకుంటాయి.

ఆదాకు మార్గాలిలా..

ఇళ్లలో సాధారణంగా సీఎఫ్ఎల్, ఎల్ఈడీ బల్బుల వాడకంతో విద్యుత్ ఆదా అవుతుందని నిపుణులు చెబుతున్నారు. అధిక వెలుగు, ఎక్కువ కాలం మన్నికనిస్తాయి. మూడు వాట్ల ఎల్ఈడీ బల్బు 45 వాట్ల ఫిల్మెంట్ బల్బుతో సమానంగా వెలుగునిస్తుంది. ఏసీ, టీవీ ఉపయోగించాక బోర్డు వద్ద స్విచాఫ్ చేయాలి. లేకుంటే చిన్న ఇండికేటర్ లైటుకూ డిజిటల్ మీటర్ యూనిట్లు కౌంట్ చేస్తుంది. ఐఎస్ఐ మార్కు ఉన్న గృహోపకరణాలు వాడాలి. 3 స్టార్, 5 స్టార్ ఐఎస్ఐ మార్క్ మోటార్లతో 20 శాతానికి పైగా విద్యుత్ ఆదా అవుతుంది. సెల్ ఫోన్ చార్జింగ్ పూర్తయ్యాక స్విచ్ కట్టాలి. ఎలక్ట్రికల్ స్టౌ, కుక్కర్‌కు బదులు గ్యాస్ స్టౌ వాడాలి. ఆటోమేటిక్ ఇస్త్రీ పెట్టె, మిక్సీ, వాషింగ్ మెషీన్ వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ హీటర్లు, గీజర్లకు బదులు సోలార్ పరికరాలు ఉపయోగించాలి. కంప్యూటర్లకు ఎర్త్ ఏర్పాటు చేయాలి. కంప్యూటర్లు షట్‌డౌన్ చేశాక స్విచాఫ్ చేయాలి. ఎలక్ట్రానిక్ వస్తువుల అవసరం లేకపోతే స్విచాఫ్ చేయాలి.

విద్యుత్ తీరిలా..

అమలాపురంలో గృహావసరాలు, వాణిజ్య., పరిశ్రమలతో పాటు, వీధిలైట్లు, వాటర్ వర్క్స్, మందిరాలు, ఆక్వా, వ్యవసాయ కనెక్షన్లు సుమారు నాలుగు లక్షలు ఉన్నాయి. అమలాపురం డివిజన్‌లో రోజుకు 2.8 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం జరుగుతుంది. దీనిద్వారా రూ.46 కోట్ల ఆదాయం వస్తుంది. ప్రస్తుతం అధికారికంగా విద్యుత్ కోతలంటూ లేవు, సాంకేతిక మరమ్మతుల సమయాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు.

సర్వీసులు ఇలా..

కేటగిరి-1	గృహావసరాలకు
కేటగిరి-2	వాణిజ్య అవసరాలు
కేటగిరి-3	పరిశ్రమలు
కేటగిరి-4	వీధిలైట్లు, పంచాయతీ వాటర్ వర్క్స్, ప్రార్థన మందిరాలు
కేటగిరి-5	ఆక్వా, వ్యవసాయం

విద్యుదుత్పత్తి చేసినట్టే..



విద్యుత్‌ను పొదుపుగా వాడడం, ఆదా చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాం. నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నాం. విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గించగలిగాం. ప్రజలు విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటే, పరోక్షంగా ఉత్పత్తి చేసినట్టే.

– **ఎస్.రాజబాబు, ఎస్ఈ,** ఏపీఈపీడీసీఎల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యమివ్వాలి



విద్యుత్‌ను పొదుపుగా వాడుకుని భావితరాల కోసం ఆదా చేయాలి. సోలార్ విద్యుత్ ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలి. విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. విద్యుత్ పొదుపు వల్ల కలిగే లాభాలను వివరిస్తూ కరపత్రాలతో ప్రచారం చేశాం.

– **మోకా రవికుమార్,** ఈఈ(ఆపరేషన్స్), ఏపీఈపీడీసీఎల్, అమలాపురం డివిజన్

సీఐ ప్రశాంత్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



అమలాపురం రూరల్: రూరల్ సీఐగా ప్రశాంత్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి సీఐగా పనిచేసిన వీరబాబు పట్టణ సీఐగా కొనసాగుతారు. ఎస్పీ కార్యాలయంలో క్రైం సీఐగా పనిచేస్తూ ప్రశాంత్‌కుమార్ బదిలీపై వచ్చారు.

లారీ ఓనర్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా స్వామినాయుడు



అమలాపురం రూరల్: జనుపల్లి గ్రామానికి చెందిన వాకపల్లి స్వామినాయుడు లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన సమావేశంలో ఆయనను రెండోసారి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

కాలభైరవ హోమానికి వితరణ

అమలాపురం టౌన్: కాల భైరవాష్టమిని పురస్కరించుకుని స్థానిక విద్యుత్ నగర్‌లోని ఆదిశేష నిలయంలో కాలభైరవ వారోత్సవాల్లో భాగంగా జరుగుతున్న హోమంలో వినియోగించేందుకు పలువురు దాతలు రూ.94 వేల విలువైన కొబ్బరి కాయలు వితరణగా అందించారు. హోమంలో ద్రవ్యాలతో పాటు, ఆహుతులుగా కొబ్బరి కాయలను వేస్తారని అక్షయ పాత్ర వ్యవస్థాపకురాలు పోతురాజు నాగ కనకదుర్గ తెలిపారు. సలాది దొరయ్యనాయుడు, అన్నపూర్ణ దంపతులు రూ.53 వేల విలువైన కొబ్బరి కాయలు, రవణం నరేంద్రకుమార్, నాగ కృష్ణవేణి దంపతులు రూ.8 వేలు, పప్పుల వెంకట్రావు, సుబ్బలక్ష్మి దంపతులు రూ.18 వేలు, సలాది వెంకట సాయిరామ్ రూ.10 వేలు, వాకాడ శ్రీనివాస్ రూ.5 వేల విలువైన కొబ్బరి కాయలు సమకూర్చారు. నాలుగో రోజు శుక్రవారం ఏకాదశ భైరవులకు విశేష హోమ ద్రవ్యాలతో ఆహుతులను సమర్పించారు. ఈ నెల 24వ తేదీ వరకూ కాలభైరవ హోమం జరుగుతుందని, ఆ రోజు రాత్రి 9 గంటలకు జరిగే పూర్ణాహుతితో హోమం ముగుస్తుందని అక్షయ పాత్ర ప్రతనిధులు తెలిపారు.

బస్సు చార్జీల పెంపుపై నిర్ణయం

యానాం: ఆరేళ్ల తర్వాత పుదుచ్చేరి రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్(పీఆర్‌టీసీ) బస్సు చార్జీలు పెంచడానికి నిర్ణయించింది. శుక్రవారం ఈ మేరకు సంస్థ కార్యదర్శి శివకుమార్ చార్జీల పెంపునకు నోటిఫికేషన్ జారీ చేశారు. సీఎం ప్రకటన తర్వాత అమలు చేస్తారన్నారు.

రెండో రోజూ అదే స్పందన

అమలాపురం టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరుతో ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌లో రెండో రోజైన శుక్రవారం వినియోగదారుల నుంచి అదే స్పందన కనపించింది. గురు, శుక్రవారాల్లో ఏర్పాటు చేసిన ఈ బజార్‌లో పట్టణానికి చెందిన స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు బ్యాంకులు ఇచ్చిన రుణాలతో తమ ఇళ్ల వద్దే కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని, తయారు చేసిన పలు ఉత్పత్తులను ఇందులో విక్రయిస్తున్నారు. రెండు రోజుల్లో ఈ బజార్ ద్వారా మహిళలు రూ.రెండు లక్షల మేర వ్యాపార లావాదేవీలు సాగించారు. అల్లికలు, తిను బండారాలు, క్లీనింగ్ పౌడర్లు, లిక్విడ్లు తదితర వస్తువులను స్వల్ప లాభాలతో మహిళలు విక్రయిస్తున్నారు. దారిద్ర్య రేఖ దిగువన ఉన్న ఈ మహిళల ఆర్థిక పురోగతికి వారి ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించవచ్చని మెప్మా సిటీ మేనేజర్ మోహన్‌కుమార్ అన్నారు. మెప్మా జిల్లా కార్యాలయం ప్రతినిధి సీహెచ్ శ్రీనివాస్, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, 30 వార్డుల రిసోర్స్‌పర్సన్లు మెప్మా బజార్ విక్రయాలను పర్యవేక్షించారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- దళిత, ప్రజా సంఘాల నిరసన



అమలాపురంలో ధర్నా చేస్తున్న దళిత, ప్రజా సంఘాల జిల్లా ప్రతినిధులు



ముమ్మిడివరం కోర్టు ఆవరణలో ధర్నా చేస్తున్న ఎస్సీ న్యాయవాదులు



యానాం పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

అమలాపురం టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి దేశ రాజ్యాంగాన్ని అపవిత్రం చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను తక్షణమే మంత్రి పదని నుంచి బర్తరఫ్ చేయాలని అమలాపురంలో పలు దళిత ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక గడియారం స్తంభం సెంటరులో శుక్రవారం సాయంత్రం ఆయా సంఘాల ఆధ్వర్యంలో అమిత్ షాకు వ్యతిరేకంగా ధర్నా జరిగింది. బీజేపీ కులతత్వ రాజకీయాలు నశించాలని, అమిత్‌షా డౌన్ డౌన్ అంటూ ఆందోళనకారులు నినాదాలు చేశారు. దళిత ఐక్య వేదిక జిల్లా చైర్మన్ డీబీ లోక్ మాట్లాడుతూ, అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాపై కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని, అంబేడ్కర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అతడిపై చర్యలు తీసుకునే వరకూ తాము ఉద్యమిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. వేదిక జిల్లా కన్వీనర్ జంగా బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, మాల మహానాడు నాయకుడు పెయ్యల శ్రీనివాసరావు, బీఎస్పీ నాయకుడు పాలమూరి మోహనబాబు తదితరులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేబినెట్ నుంచి తొలగించాలి

ముమ్మిడివరం: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షాను తక్షణం కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని బార్ అసోసియేషన్ ఎస్సీ న్యాయవాదులు డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ముమ్మిడివరం కోర్టు ఆవరణలో శుక్రవారం ఎస్సీ న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. అశాస్త్రీయ వ్యాఖ్యానంతో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను పోల్చడమే కాకుండా, పార్లమెంట్ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించడం రాజ్యాంగ ధిక్కరణగా బావించి, సభాపతి వెంటనే ఆయనపై చర్యలకు సిఫారసు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అమిత్ షా ప్రవర్తనను బీజేపీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్థించడం రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. న్యాయవాదులు వడ్డి నాగేశ్వరరావు, కాశి బాబు జగ్జీవన్‌రావు, దోనిపాటి ఆంజనేయులు, పీవీ చక్రవర్తి, కాశి సింహాద్రివరియా, ముడే వెంకటరావు, గోనమండ వెంకటేశ్వరరావు, వడ్డి త్రిమూర్తులు, అయినవిల్లి వలీయా బాబా, పలివెల నరేష్ పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని మాల మహానాడు జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పోలమ్మ చెరువు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు.

నిరసన ర్యాలీ

యానాం: పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానిస్తూ, వ్యంగ్యంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం యానాం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ వద్ద అంబేడ్కర్ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడిన అమితి షా తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనను పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. అనంతరం స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్, నాయకులు మల్లాడి సత్తిబాబు, లంక బంగారం, దున్నా చక్రవర్తి, చీకట్ల రామకృష్ణ, మెల్లం చిన్న, మల్లాడి బీరాస్వామి, శ్రీధర్, గణేష్ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

అమలాపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని తాండవపల్లి గ్రామంలో శుక్రవారం దళిత సంఘాల నాయకులు అతని దిష్టిబొమ్మను దహనం చేశారు. అమిత్ షాను తక్షణం మంత్రి పదవి నుండి తొలగించాలంటూ నినాదాలు చేశారు. మాజీ సర్పంచ్ పరమట శరత్‌బాబు, ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు, ఉప సర్పంచ్ జి.సత్యనారాయణ, కుంచే ఘటోత్కచుడు, పరమట శ్రీనివాసరావు, గుత్తాల రాజు తదితరులు పాల్గొన్నారు.

తరచూ ఆహార తనిఖీలు నిర్వహించాలి



కమిషనర్ రాజుకు వినతిపత్రం ఇస్తున్న సూర్యనారాయణమూర్తి తదితరులు

అమలాపురం టౌన్: పట్టణంలోని హోటళ్లు, ప్లాట్‌ఫారాలపై ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు పెరిగిపోయిన దృష్ట్యా తరచూ ఆహార తనిఖీలు నిర్వహించాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజును కలసిన ఆయన.. పట్టణంలో ఆహార తనిఖీలు చేపట్టాల్సిన ఆవశ్యతకను వివరించారు. అలాగే పట్టణంలో ప్లాస్టిక్ డిస్పోజబుల్ వస్తువుల వాడకం కూడా విపరీతంగా పెరిగిందని, వాటిని రోడ్లపై కాకుండా డ్రైన్లలో కుప్పలుగా పడేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార కలుషితాన్ని అరికట్టేందుకు తక్షణమే ఫుడ్ కంట్రోలర్‌ను రంగంలోకి దింపాలని కోరారు. అలాగే ప్లాస్టిక్ డిస్పోజబుల్ వ్యర్థాల వల్ల పట్టణంలో దోమలు పెరిగి వైరల్ జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. కమిషనర్‌ను కలిసిన వారిలో పార్టీ నాయకులు కొనుకు వెంకటేశ్వరరావు, పితాని బేబీరావు, కుసుమే నరసింహరాజు, వాసంశెట్టి గణేష్, బొంతు నగేష్ ఉన్నారు.

ఆ నిర్ణయాలతో ఏజెంట్లకు అన్యాయం

- ఎల్ఐసీ ఏవోఐ వ్యవస్థాపక దినోత్సవం



సంఘ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహిస్తున్న ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఎల్ఐసీ యాజమాన్యం ఇటీవల తీసుకున్న కొన్ని నిర్ణయాల వల్ల ఏజెంట్లకు అన్యాయం జరుగుతోందని ఏవోఐ సంఘ అధ్యక్షుడు సానబోయిన వీరభద్రరావు అన్నారు. ఎల్ఐసీ ఏజెంట్ల ఏవోఐ యూనియన్ వ్యవస్థాప దినోత్సవాన్ని స్థానిక ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ ఏర్పడి 21 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సంఘ అధ్యక్షుడు వీరభద్రరావు ఆధ్వర్యంలో వ్యవస్థాపక దినోత్సవ సంబరాలు నిర్వహించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 11న ఢిల్లీలో జరిగే ధర్నాలో జిల్లా నుంచి ఎల్ఐసీ ఏజెంట్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని, కేంద్ర ప్రభుత్వం బీమా సేవల్లో తెచ్చిన మార్పులను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగే నిరసన కార్యక్రమం రోజున కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసీ ఖాతాదారులు, ఏజెంట్ల నుంచి కోటి సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా పట్టణంలో ఖాతాదారులు, ఏజెంట్ల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘ కార్యదర్శి గుమ్మలూరు వినాయకరావు, కోశాధికారి దొమ్మేటి శివస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి అయినవిల్లి నాగేంద్రకుమార్, ఉపాధ్యక్షుడు శీలం లంకేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు పనులు చేపట్టాలి

యానాం: నియోజకవర్గ శివారు దరియాలతిప్ప ఆయకట్టులోని రైతాంగ సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అధికారులను ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో దరియాలతిప్ప, దొమ్మేటిపేట తదితర ప్రాంతాల రైతులు తమ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన ఆర్ఏఓ మునిస్వామి, పీడబ్ల్యూడీ ఏఈ కాళ్ల నాగరాజుతో చర్చించారు.

నేడు 'ఓం శాంతి' ధ్యాన దినోత్సవం

అమలాపురం టౌన్: ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా స్థానిక రవణం వీధిలో శివాలయం వద్ద ఉన్న ఓం శాంతి కేంద్ర భవనం(హార్మోని హౌస్)లో శనివారం ఉదయం ఏడు గంటల నుంచి ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఇన్‌చార్జి బ్రహ్మకుమారి శ్రీదేవి తెలిపారు. ఈ ధ్యాన కార్యక్రమానికి కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ హాజరవుతారని చెప్పారు.

మహిళలు అధికంగా హాజరవ్వాలి

అమలాపురం టౌన్: విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం మహాసభలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వీహెచ్‌పీ ఉత్తరాంధ్ర మహిళా ప్రముఖ్ సునీత కోరారు. స్థానిక గణేష్‌నగర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. మహిళలను హిందూ సమ్మేళనంతో శంఖారావానికి సిద్ధం చేస్తూ వారిని చైతన్య పరిచారు.

దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరి ఆదిద్రావిడ శాఖ, ఎస్టీ సంక్షేమ శాఖ ద్వారా సంక్రాంతికి ఉచిత దుస్తుల స్థానంలో నగదు పంపిణీకి యానాం ప్రాంతానికి చెందిన ఎస్సీ, ఎస్టీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం ఆ శాఖ ఏడీ రేకాడి కృష్ణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు, కొత్తగా రేషన్ కార్డులో నమోదైన వారి ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను ఈ నెల 27లోగా తమను సంప్రదించాలని కోరారు.

నీలపల్లిలో రెవెన్యూ సదస్సు

తాళ్లరేవు: నీలపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అనేక సమస్యలు వెల్లువెత్తాయి. సర్పంచ్ చిట్టూరి నాగమణి అధ్యక్షత వహించారు. డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబు, ఇతర సిబ్బంది అర్జీలను స్వీకరించారు. తాగునీటి సమస్య, పానేటి కాలువ కాలుష్యం, భూ ఆక్రమణ, డ్రైనేజీలు తదితర సమస్యలపై అర్జీలందాయి.

రీ సర్వే ప్రారంభం

తాళ్లరేవు: భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి నిర్వహిస్తున్న రీ సర్వే కార్యక్రమం శుక్రవారం పటవల పంచాయతీలో ప్రారంభమైంది. ఎంపీపీ రాయుడు సునీత ప్రారంభించారు. పక్కా సర్వేతో భూ యజమానులకు న్యాయం చేసేలా కార్యక్రమం ఉంటుందన్నారు.

ఇన్‌చార్జీల పాలనతో అవస్థలు

ఉప్పలగుప్తం: మండల పరిషత్, పంచాయతీ కార్యాలయాల్లో ఇన్‌చార్జీల పాలనతో అవస్థలు ఎదురవుతున్నాయని జెడ్పీటీసీ గెడ్డం సంపదరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు చెప్పారు. స్థా నిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పీఆర్‌సీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు జరిగిన శిక్షణలో వారు మాట్లాడుతూ, ఇన్‌చార్జి కార్యదర్శుల వల్ల పాలన కుంటుపడుతోందన్నారు.

సుస్థిరాభివృద్ధికి కృషి జరగాలి

ముమ్మిడివరం: గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి సాధించే దిశగా పంచాయతీలు కృషి చేయాలని ఎంపీపీ కోలా గంగాభవాని అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక 2025-26 శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ తాడి వెంకటాచార్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గ్రామాలలో సమగ్రాభివృద్ధి సాధించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం కోసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గ్రామాల అభివృద్ధి ప్రణాళికలో మార్గదర్శకాలను వివరించారు. సుస్థిరాభివృద్ధి, స్థిరమైన లక్ష్యసాధన దిశగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, వైస్ ఎంపీపీ పాము నాగమణి, మట్టపర్తి సురేష్, గోలకోటి దొరబాబు, మట్టపర్తి సత్యనారాయణ, ఈఓపీఆర్డీ లక్ష్మీకల్యాణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు శిక్షణ

తాళ్లరేవు: గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలలని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.సత్యనారాయణ అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం జరిగింది. జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, రాయుడు గంగాధర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అల్లవరం: పంచాయతీల అభివృద్ధికి వనరులు సమకూర్చేందుకు ప్రణాళికల తయారీపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.